పల్లెప్రకృతి వనం బోర్డు కనబడుటలేదు

చిలిపిచెడ్, జనవరి 9: బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామీణ స్థాయిలో పల్లెలు పచ్చగా ఉండాలనే ఉద్దేశంలో గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేయించారు. చిలిపిచెడ్ మండలంలోని శీలాంపల్లి గ్రామంలో పల్లె ప్రకృతి వనం పేరిట ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు కనబడుట లేదు. ఏడాది గడుస్తున్నా గ్రామ కార్యదర్శి, ఎంపీడీవో, ఎంపీవో సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు.

గుర్తుతెలియని బైక్ ఢీకొని వ్యక్తి మృతి

రామాయంపేట, జనవరి 9: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృత్యువాత పడ్డ ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్కన్నపేట గ్రామంలోని శివాలయం దేవాలయం వద్ద బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా రథాలరాంరెడ్డి గ్రామానికి చెందిన దండెబోయిన నారాయణ(58) కాలినడకన వస్తున్నాడు. మృతుడిని వెనుక నుంచి వచ్చిన బైక్ అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పన్నుల వసూలుపై కార్యదర్శులతో సమావేశం

గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆనంద్

చిలిపిచెడ్, జనవరి 9: పన్నుల వసూలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా, యాక్షన్ ప్లాన్ తయారీ, పారిశుధ్యం, పన్నుల వసూలు, నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్ అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో శ్యామ్‌కుమార్, ఈసీ భగవాన్‌రెడ్డి, గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతి

నాగరాజు (ఫైల్)

చేగుంట, జనవరి 9: చేగుంటకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ వరగంటి నాగరాజు(75) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. ఆయన చేగుంట, వడియారం, రెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎంగా, దుబ్బాక రెసిడెన్షియల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. నాగరాజు మృతిపై విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కరణం నర్సింహులు, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వెంకటల క్ష్మీరఘురాములు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి తదితరులు నివాళులర్పించారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 9: మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

మాలజంగం సావిత్రి

శివ్వంపేట, జనవరి 9: మహిళ అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొంతి గ్రామంలో చోటు చేసుకున్న ది. ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి గ్రామానికి చెందిన 44 ఏండ్ల మాలజంగం సావిత్రి అలియాస్ మహమ్మద్ సలీమాబేగం ఈ నెల 8వ తేదీ ఉదయం పని ఉన్నదేమో తెలుసుకుంటానని చెప్పి ఇంట్లోంచి వెళ్లింది. మధ్యాహ్నం ఆమె భర్త కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త మాలజంగం కుమార్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 9: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చేరి ఉన్నత భవిష్యత్తుకు మార్గం సుగుమం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, రీజినల్ గంగరామ్ నాయక్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రాయ్ పాల్గొన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్ తదితరులు

కొల్చారంలో..

కొల్చారం, డిసెంబర్ 9: గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కొల్చారం సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ సత్యకుమారి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతిరావు పూలే, బీసీ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5 తరగతిలో ప్రవేశాలతో పాటు 6 నుంచి 9 తరగతులకు మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సంక్రాంతి వేడుకలకు సర్వం సిద్ధం

మెదక్ మున్సిపాలిటీ: ముక్కోటి ఏకాదశి వేడుకలకు ముస్తాబైన పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం



రామాయంపేట: రంగురంగుల ముగ్గుల కోసం పట్టణంలో వెలిసిన రంగుల స్టాళ్లు

రామాయంపేట: పట్టణంలో రకరకాల పతంగులను విక్రయిస్తున్న దుకాణాదారుడు

- రంగురంగుల ముగ్గుల స్టాళ్లు
- యువతను ఆకర్షించేలా పతంగుల దుకాణాల ఏర్పాటు

ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 9: ధనుర్మాస శుక్ల పక్షంలో వచ్చే వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుంటే పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం. శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని పలు ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. అన్ని ఆలయాల్లో ఉదయం 4 గంటలకు ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులను అనుమతించనున్నారు.

రామాయంపేటలో సంక్రాంతికి ఏర్పాట్లు

రామాయంపేట, జనవరి 9: రామాయంపేటలో సంక్రాంతి వేడుకలకు సిద్ధమయ్యారు. పండుగ సందర్భంగా పతంగుల దుకాణాలు, రంగురంగుల ముగ్గుల స్టాళ్లను ఏర్పాటు చేశారు.

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

రాజకీయ నాయకులు, సినిమా హీరోలు, క్రికెటర్ల ఫొటోలతో ముద్రించిన పతంగులను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

జిల్లా కేంద్రంలోని మహిళా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ముగ్గులకు ప్రిన్సిపాల్ ఉమాదేవి బహుమతులు అందజేశారు.

పోలీసుల పనితీరుపై క్యూఆర్ కోడ్

క్యూఆర్‌కోడ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గెలిచిన జట్టుకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ

- పోలీస్ సేవల ఫీడ్‌బ్యాక్ కోసమే
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 9: పోలీసుల పనితీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. డీజీపీ కార్యాలయం హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సమావేశంలో డీజీపీ డాక్టర్ జితేందర్ పోస్టర్లను ప్రారంభించారు. బాధితులు సమస్యలు విన్నవించేందుకు పోలీస్ స్టేషన్లకు వెళ్లిన అనంతరం సిబ్బంది వ్యవహరించిన తీరు, ఫిర్యాదులు మొదలు పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, ఈ చలాన్, ఎఫ్ఐఆర్, ఇతర సేవల గురించి ప్రజలకు ఉన్న అభిప్రాయాలను సేకరించేందుకు క్యూఆర్‌కోడ్ తీసుకొచ్చినట్లు తెలిపారు.

ముగిసిన పోలీసు క్రీడలు

జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా క్రీడలు పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో 3 డివిజన్ల జట్లు పాల్గొన్నాయని, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, టగ్గాఫ్‌వార్, లాంగ్ జంప్, 100 మీటలర్ల పరుగు పందెం పోటీలు జరిగాయి. పోటీల్లో గెలిచిన క్రీడకారులు రాష్ట్ర స్థాయి పోటీలో కూడా పాల్గొంటారని ఎస్పీ తెలిపారు. విజేతలకు ఎస్పీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయికి సంజనశ్రీ ప్రాజెక్టు ఎంపిక



సంజనశ్రీకి మెమోంటో, సర్టిఫికెట్ అందజేస్తున్న జడ్పర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 9: మహబూబ్‌నగర్ జిల్లా జడ్పర్లలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో మెదక్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని సంజనశ్రీ రూపొందించిన ప్రాజెక్టు జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో లింగాయిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి శివ చైతన్య, మెదక్ గీతా హైస్కూల్‌కు చెందిన యుమన్, మంబోజిపల్లి గీతా హైస్కూల్‌కు చెందిన అంజన, తూప్రాన్ గీతా హైస్కూల్‌కు చెందిన అఫీసా ఫాతీమా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతులు పొందినట్లు పేర్కొన్నారు. జడ్పర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బహుమతులు అందజేశారు. జాతీయ స్థాయికి ఎంపికైన సంజనశ్రీ, రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, డీఈవో రాధాకిషన్ అభినందించారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో నిర్వహించే దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

ఆయిల్ పామ్ సాగు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేనేజర్ కృష్ణ

నిజాంపేట, జనవరి 9: సంప్రదాయ పంటలకు స్వస్తి చెబుతూ ఆర్థిక లాభాన్ని చేకూర్చే ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని మేనేజర్ కృష్ణ రైతులకు సూచించారు. గురువారం నిజాంపేట రైతువేదికలో నిర్వహించిన ఆయిల్ పామ్ సాగుపై రైతు అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుకు తక్కువ నీటి అవసరం ఉంటుందని, మొక్క నాటిన నుంచి మూడేండ్లలో పంట దిగుబడి ప్రారంభం అవుతుందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుందన్నారు. రైతులు ఈ దిశగా ఆలోచించి ఆయిల్ పామ్ సాగు చేయాలన్నారు. సమావేశంలో ఏవో సోమలింగారెడ్డి, ఏఈవో శ్రీలత, రమ్య, ఆయిల్ పామ్ డిప్యూటీ మేనేజర్ ప్రశాంత్, చల్మెడ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, రైతులు రాజేశ్వర్‌రెడ్డి, ఎల్లయ్య, సంగమేశ్వర్, రాజం తదితరులు ఉన్నారు.

భరోసా కేంద్రం, సబ్‌జైల్‌లో న్యాయమూర్తి తనిఖీ

మెదక్ అర్బన్, జనవరి 9: జిల్లా కేంద్రంలోని స్టేడియం వద్ద ఉన్న భరోసా కేంద్రాన్ని సీనియర్ సివిల్ న్యాయయూర్తి జితేందర్ గురువారం తనిఖీ చేశారు. ఆయన వెంట అదనపు ఎస్పీ మహేందర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రామశర్మ, న్యాయవాదులు కరుణాకర్, శారద ఉన్నారు.

సబ్‌జైల్‌ను తనిఖీ

సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ మెదక్ సబ్ జైల్‌ను తనిఖీ చేశారు. ఖైదీల ఆరోగ్యం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఖైదీలకు ఆహారం అందించాలన్నారు. అనంతరం వంటశాలను తనిఖీ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నిజాంపేట, జనవరి 9: మండలంలోని వెంకటాపూర్(కె) గ్రామానికి చెందిన ఆంజనేయులుకు రూ.17,500లు, భుజేందర్‌కు రూ.33 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. గురువారం శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ హైదరాబాద్‌లో తన కార్యాలయంలో బాధితులకు ఈ చెక్కులు అందజేశారు. బీఆర్ఎస్ కార్యకర్త దయాకర్, బీబీపేట మాజీ ఎంపీపీ బాలమణి, మహిపాల్, రాజు, శివరాజ్ ఉన్నారు.

రామాయంపేటలో

రామాయంపేట, జనవరి 9: రామాయంపేటలోని కటికెవాడలో నివాసిస్తున్న కటికె శంకర్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్సలు పొందాడు. విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు రూ.54 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంజూరు చేయించారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

మున్సిపాలిటీ, జనవరి 9: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, నిర్లక్ష్యం, ర్యాష్ డ్రైవింగ్‌ను నివారించాలని ఎంవీఐ విజయలక్ష్మి సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం కార్యాలయ ప్రాంగణంలో భారీ వాహనాలు, డీసీఎం, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డుపై ప్రజల భద్రతను నిర్దారిస్తూ సురక్షితంగా వాహనాలు నడపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని, వాటికి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. అనంతరం రోడ్డు భద్రత త్సోవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రిటైర్డు డీటీవో గణేశ్, ఎంవీఐలు శ్రీనివాస్‌రావు, శ్రీలేఖ, సిబ్బంది సందీప్, శ్రావణి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చిలిపిచెడ్, జనవరి 9: వాహనాదారులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్సై నర్సింహులు తెలిపారు. గురువారం చందూర్ చౌరస్తా వద్ద రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై మిస్బోద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మృతదేహానికి రీ పోస్టుమార్టం

రామాయంపేట, జనవరి 9: మహిళ మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించిన ఘటన రామాయాంపేట మండలం సుతారిపల్లి గ్రామంలో గురువారం జరిగింది. రామాయంపేట పోలీసులు, తహసీల్దార్ కథనం ప్రకారం.. పెద్దవాలోల్ల లక్ష్మి(48) గత నెల క్రితం అస్వస్థతకు గురికావడంతో హైదరాబాద్‌లోని మల్లారెడ్డి దవాఖానలో కుటుంబ సభ్యులు చేర్పించి చికిత్సలు నిర్వహించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి లక్ష్మి మృతి చెందింది. దీంతో గాంధీ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బంధువులు ఆమె మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం మల్లారెడ్డి దవాఖాన వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే లక్ష్మి మృతి చెందిందని మృతురాలి బంధువు అశ్వి ని హైదరాబాద్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు గాంధీ దవాఖాన వైద్యులు సుతారిపల్లి గ్రామానికి చేరుకుని జేసీబీ ద్వారా డెడ్ బాడీని బయటకు తీసి లక్ష్మి మృతదేహానికి రీ పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం అయ్యేంత వరకు మృతురాలి బంధువులతో పాటు రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారి, ఎస్సై బాలరాజు తమ సిబ్బందితో ఘటనా స్థలంలోనే ఉన్నారు. మృతురాలి బంధువుల అనుమా నం మేరకే రీ పోస్టుమార్టం చేసినట్లు తహసీల్దార్, ఎస్సైలు విలేకరులతో తెలిపారు.

పంటలపై ఫర్టిలైజర్ డీలర్లకు అవగాహన అవసరం

జిల్లా వ్యవసాయధికారి విక్టర్ వినయ్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయధికారి విక్టర్ వినయ్‌కుమార్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 9: పంటలపై వ్యవసాయ అధికారులతో పాటు ఫర్టిలైజర్ డీలర్లు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి వినయ్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పంటలపై రైతులు, ఫర్టిలైజర్ డీలర్లకు అమీష్ క్రాస్ సైన్స్ ఆధ్వర్యం లో అవగాహన కల్పించారు. వినయ్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా వరి సాగు చేస్తార ని, ఏ పంటకైనా పొటాష్, భాస్వరం, యూరి యా తప్పనిసరిగా వాడుతుంటారన్నారు. వీటిని ఎలా వాడాలో రైతులకు డీలర్లు చెప్పాలని సూచించారు. పురుగు మందులు మార్కెట్లో ఎన్నో రకాలుగా వస్తున్నాయని, వాటిలో వ్యవసాయాధికారుల సలహాలు తీసుకుని వాడాలన్నారు. అమిటాప్ ఉత్పత్తులను ఆవిష్కరించారు. మెదక్ సొసైటీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, డివిజన్ వ్యవసాయధికారి విజయలక్ష్మి, రాజ్‌నారాయణ, ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింలు, బాధ్యులు కృష్ణారెడ్డి, రామకృష్ణ, యుగంధర్‌రెడ్డి, సంధ్యారాణి, సత్యం, రాజు, వినోద్, అమీష్ క్రాస్ సైన్స్ ప్రతినిధులు అమ్రేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బాలు తొలిగించాలని గ్రామస్తుల ధర్నా

మెదక్ రహదారిపై రాస్తారోకో చేపడుతున్న తిరుమలాపూర్ గ్రామస్తులు

పెద్దశంకరంపేట, జనవరి 9: పెద్దశంకరంపేటలోని తిరుమలాపూర్ గ్రామంలోకి వెళ్లే సీసీ రోడ్డు రహదారిపై ఉన్న మురుగు కాల్వపై పలువురు అక్రమంగా వేసిన డబ్బాలు వెంటనే తొలిగించాలని డిమాండ్ చేస్తూ గురువారం తిరుమలాపురం గ్రామస్తులు పెద్దశంకరంపేట-మెదక్ రహదారిపై ధర్నా-రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయమై కలెక్టర్, డీపీవో, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా వేసిన డబ్బాలు తొలిగించాలని వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ధర్నాకు దిగామన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఒత్తిడి లేని జీవితం గడిపేలా చూసుకోవాలి

ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నర్సాపూర్, జనవరి 9: ప్రతి ఉద్యోగి తన వ్యక్తిగత జీవితంలో ఒత్తిడి లేకుండా చూసుకోవాలని డీపీవో యాదయ్య పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్‌లోని యాదవ ఫంక్షన్ హాల్‌లో పంచాయతీరాజ్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై ప్రఖ్యాత సైకాలజిస్ట్ సునీత కొర్రపాటితో ఒక రోజు సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధులత, సీడీపీవో హేమభార్గవి, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో పౌల్ట్రీ రైతు ఆత్మహత్య

గొట్టిముక్కల యాదగిరి (ఫైల్)

నర్సాపూర్, జనవరి 9: అప్పుల బాధ భరించలేక పౌల్ట్రీఫామ్‌లోనే రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన గొట్టిముక్కల యాదగిరి (52) వ్యవసాయం చేస్తూ, పౌల్ట్రీ ఫామ్ నడుపుతూ జీవిస్తున్నాడు. యాదగిరికి గ్రామ శివారులో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో కొన్ని నెలల క్రితం పౌల్ట్రీ షెడ్డు నిర్మించాడు. షెడ్డు నిర్మాణానికి యాదగిరి కొంత అప్పుచేశాడు. తను సాగు చేస్తున్న భూమి తన తండ్రి పేరు మీద ఉన్నప్పటికీ తన పేరు మీద పట్టా కాలేదు. ఈ రెండు విషయాలను మనసులో పెట్టుకుని కొన్ని రోజులుగా తనలో తాను మనస్తాపం చెందుతూ తన భార్యకు చెబు తూ బాధపడేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం యాదగిరి అప్పులు ఎలా తీర్చాలో తోచక పౌల్ట్రీఫామ్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నర్సాపూర్ ఆర్టీసీ డిపోలో అగ్నిప్రమాదం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

దగ్ధమైన సీజింగ్ వాహనాలు

నర్సాపూర్, జనవరి 9: నర్సాపూర్‌లోని ఆర్టీసీ డిపోలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. డిపోలో ఉంచిన సీజింగ్ వాహనాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఐదు వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే ఆర్టీఏ అధికారులు గతంలో కొన్ని వాహనాలను సీజ్ చేసి నర్సాపూర్ ఆర్టీసీ డిపోలో పార్కు చేశారు. ఈ అగ్నిప్రమాదంలో 4 టాటా ఏస్‌లు, ఒక కారు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇది గమనించిన ఆర్టీసీ డిపో సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. మంటలు గమనించిన సిబ్బంది పక్కనే ఉన్న ఆర్టీసీ బస్సులను దూరంగా తీసుకెళ్లడంతో బస్సులకు ఎలాంటి అపాయం జరగలేదు.

చైనా మాంజాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

చైనా మాంజాను స్వాధీనం చేసుకుంటున్న మెదక్ పట్టణ సీఐ నాగరాజు, సిబ్బంది

మెదక్ అర్బన్, జనవరి 9: జిల్లా కేంద్రంలోని ఫతేనగర్ కాలనీలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను అమ్ముతున్న వ్యక్తి నుంచి ఎనిమిది బెండళ్లు స్వాధీనం చేసుకున్నారు. గురువారం కేసు నమోదు చేసినట్లు మెదక్ పట్టణ సీఐ నాగరాజు ప్రకటనలో తెలిపారు. చైనా మాంజా అమ్మినవారిపై చట్టరీత్యా చర్య తీసుకుంటామని పేర్కొన్నారు. మెదక్ పట్టణంలోని గాలిపటాల దుకాణాలను సీఐ నాగరజు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.